## క్లుప్తంగా

### శ్రావణమాస పూజలు



ఇంద్రాదేవి ఆలయంలో పూజలు చేస్తున్న ఆదివాసీలు

**ఇంద్రవెల్లి:** మండల కేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయంలో శ్రావణమాస పూజలను ఆదివాసీలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం మండలంలోని పొల్లుగూడ, ఖైర్‌గూడ, కొబ్బయ్‌గూడ, గట్టెపల్లి, చిత్తగూడ, కొలాంగడ ఆదివాసీలు తరలివచ్చి ఇంద్రాదేవికి శ్రావణ మాస పూజలు చేశారు. ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యంతో ఉండాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో ఆదివాసీలు కోరెంగా లింగు, జుగాదిరావ్, కాశీరాం, భుజంగ్‌రావ్, నాగోరావ్, భరత్, నాందేవ్ పాల్గొన్నారు.

### గ్యాస్ సబ్సిడీకి ప్రత్యేక బ్యాంక్ అకౌంట్ అవసరం లేదు



వివరాలు తెలుసుకుంటున్న డీఎస్‌వో, ఎల్‌డీఎం

**కైలాస్‌నగర్:** రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద అందించే రూ. 500 గ్యాస్ సబ్సిడీని పొందేందుకు ఎలాంటి ప్రత్యేక బ్యాంకు అకౌంట్ అవసరం లేదని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కిరణ్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ ఉత్పల్ కుమార్‌తో కలిసి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు బ్యాంకును సందర్శించారు. గ్యాస్ సబ్సిడీ వివరాలపై ఆరా తీశారు. ప్రజా పాలన కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుని ఇదివరకు సబ్సిడీ అందనటువంటి వారు పట్టణవాసులు మున్సిపాలిటీలో, గ్రామీణ ప్రజలు ఎంపీడీవో కార్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

### బంద్ విజయవంతం చేయండి

**సిరికొండ:** బంగ్లాదేశ్‌లో హిందువులపై, హిందు దేవాలయాలపై దాడిని నిరసిస్తూ.. నేడు సిరికొండ మండలం బంద్ పాటించాలని సనాతన హిందూ ఉత్సవ కమిటీ పిలుపునిచ్చింది. వ్యాపారులు బంద్ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

**ఉట్నూర్‌రూరల్:** బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా శనివారం ఉట్నూర్ పట్టణ బంద్‌కు పిలుపునివ్వడం జరిగిందని హిందు ఐక్యవేదిక నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

### నేడు జిల్లాస్థాయి యోగా పోటీలు

**ఆదిలాబాద్:** జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యోగా పోటీలను శనివారం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని శ్రీ పతంజలి యోగా శిక్షణ కేంద్రంలో ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

### బ్రెయిన్ స్ట్రోక్‌తో సీఆర్టీ మృతి

**బేల:** మండల కేంద్రంలోని కేజీబీవీకి చెందిన వృక్షశాస్త్రం పీజీ సీఆర్టీ మల్లేశ్వరి (35) గురువారం రాత్రి బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందింది. గత 3 ఏళ్లుగా సీఆర్టీగా పని చేస్తుంది. రెండు రోజుల క్రితం ఆమె జ్వరంతో బాధపడుతుండగా.. కుటుంబసభ్యులు రిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ.. గురువారం రాత్రి బ్రెయిన్‌స్ట్రోక్‌తో మృతిచెందింది. ఆమె భర్త చంద్రశేఖర్ జిల్లా కేంద్రంలోని జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో మధ్యాహ్న భోజనం విభాగం ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు.

### అనారోగ్యంతో రేషన్ డీలర్ మృతి

**జైనథ్:** మండలంలోని ఖాప్రి గ్రామానికి చెందిన రేషన్ డీలర్ కుసుమ రామన్న ఆదిలాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గత కొన్ని రోజులు అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన వారం రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

### బాధిత కుటుంబానికి సాయం

**ఖానాపూర్:** పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన బెజ్జారపు గంగాధర్, అతని తండ్రి చిన్నయ్య ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబానికి శుక్రవారం ఎన్‌ఆర్‌ఐ పన్నెల జనార్దన్ రూ.10వేలను సమకూర్చగా కాలనీవాసులు లాలూనాయక్, శంకర్, మారుతి, ప్రసాద్, అశోక్, రాజ్‌కమల్, లక్ష్మి నగదు అందజేశారు.

## వైభవంగా వరలక్ష్మీ పూజలు

**ఇచ్చోడ/బోథ్/తలమడుగు/జైనథ్/బేల:** ఆయా మండలాల్లో శుక్రవారం వరలక్ష్మీ పూజలను మహిళలు ఘనంగా నిర్వహించారు. వరలక్ష్మీ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పరస్పరం వాయినాలను ఇచ్చి పుచ్చుకున్నారు. నైవేద్యం, పిండివంటలు సమర్పించారు. ఉదయం నుంచే ఆలయాలు కిటకిటలాడాయి.



తలమడుగు: శ్రీవేంకటేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు



జైనథ్: వ్రతాలను ఆచరిస్తున్న భక్తులు



బేల: వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు



ఇచ్చోడ: పూజలు చేస్తున్న మహిళలు

## మహిళలకు క్షమాపణ చెప్పాలి



కేటీఆర్ ఫ్లెక్సీని దహనం చేస్తున్న నాయకులు



కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

- కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం

**కైలాస్‌నగర్:** ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన కేటీఆర్‌పై కాంగ్రెస్ శ్రేణులు భగ్గు మన్నాయి. ఆదిలాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. కేటీఆర్ ఫ్లెక్సీని చెప్పులతో కొడుతూ నినాదాలు చేశారు. అనంతరం ఫ్లెక్సీని దహనం చేశారు. ఈసందర్భంగా కంది శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌ను ప్రజలు ఓడించినా.. ఇంకా బుద్ధి రాలేదన్నారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు లోక ప్రవీణ్ రెడ్డి, కలాల శ్రీనివాస్, కిషన్, ఆనంద్ రావు, రూపేష్ రెడ్డి పాల్గొన్నారు.

**నేరడిగొండ:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంటనే మహిళలకు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన కేటీఆర్ క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆడే వసంతరావు, ప్రఫుల్ చందర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, పాల శంకర్, పోతా రెడ్డి, మధుకర్, ఇసాక్, గంధం నవీన్, యాదవ్ రావు, మండడి గంగారామ్, నగేశ్, ఆడే కృష్ణ, జాదవ్ కపిల్‌దేవ్, తొడసం శంకర్ పాల్గొన్నారు.

**ఇంద్రవెల్లి:** మహాలక్ష్మి పథకంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ నాయకులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

**బజార్‌హత్నూర్:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ ఆడపడుచుల గురించి అవమానకరంగా మాట్లాడటం సరికాదని కాంగ్రెస్ మండల కన్వీనర్ జల్కే పాండురంగ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో గంగాధర్, సూర్యవంశీ, కీర్తి రమణ, జడల శ్రీనివాస్, రాము, చట్ల జగదీష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

**బోథ్:** మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద శుక్రవారం కాంగ్రెస్ నాయకులు కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. మహిళల అగౌరవ పరిచేలా కేటీఆర్ వ్యాఖ్యలు చేయడంపై మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు బొడ్డు గంగారెడ్డి, చంటి, గొర్ల రాజు, మహేందర్, భోజన్న, మహ్మమ్మద్, అరుణ్, అబూద్, షాకీర్, రహీమొద్దిన్, నారాయణ, శేఖర్, భోజన్న పాల్గొన్నారు.

### నేడు దివ్యాంగుల మహాసభ

**ఆదిలాబాద్‌టౌన్:** దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక మూడో జిల్లా మహాసభ శనివారం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు నగేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. మహాసభలకు రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని సుందరయ్యభవనంలో మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం చర్చించడం జరుగుతుందన్నారు.

### రేపు కవి సమ్మేళనం

**ఎదులాపురం:** వామన్ దాదా కర్డక్ 102వ జయంతిని పురస్కరించుకొని సమతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు అనిల్ సాప్తే తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్‌మీడియా ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈనెల 18న ఉదయం 11 గంటల నుంచి 4 గంటల వరకు కైలాస్‌నగర్ కాలనీలోని బుద్ధవిహార్లో ఈకార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు.

### పరామర్శ

**సిరికొండ:** మండల కేంద్రంలో పిచ్చికుక్క దాడి చేసి నలుగురిని గాయపర్చడంతో శుక్రవారం డీఎల్‌పీవో ఫణీందర్ బాధితులను ఇంటికి వెళ్లి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వారి వివరాలు సేకరించి కలెక్టర్‌కు నివేదించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో సంతోష్, పంచాయతీ కార్యదర్శి అరుణ్ కుమార్, ఆశ కార్యకర్త జ్యోతి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి



ఎన్నికలపై దిశా నిర్దేశం చేస్తున్న కంది శ్రీనివాస్‌రెడ్డి

**కైలాస్‌నగర్:** త్వరలో జరుగనున్న పంచాయతీ, ప్రాదేశిక ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రజాసేవాభవన్‌లో ఆదిలాబాద్ నియోజకవర్గంలోని జైనథ్ మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన కార్యాచరణపై దిశా నిర్దేశం చేశారు. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలను పెద్ద సంఖ్యలో గెలుచుకోవాలని సూచించారు. పార్టీ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు చిత్తశుద్ధితో పని చేయాలని కోరారు.

**కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభం**

పట్టణంలోని 30వ వార్డు ఖానాపూర్ కాలనీలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఆరు గ్యారంటీలు, రుణమాఫీలపై ప్రజలకు వివరించాలన్నారు. వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని శ్రేణులకు సూచించారు. నాయకులు గిమ్మ సంతోష్, సోనియ మంథని, కొండూరి రవి, హకీమ్, ముఖీమ్, కర్మ ఖాన్, అబ్దుల్ పాల్గొన్నారు.

## సబ్‌స్టేషన్ ముట్టడించిన గ్రామస్తులు



సబ్‌స్టేషన్ వద్ద గ్రామస్తుల ఆందోళన

**తాంసి:** తరచుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని శుక్రవారం జామిడి గ్రామస్తులు మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. కరెంట్ సరఫరాలో అప్రకటిత కోతలు, అంతరాయం నిరసిస్తూ.. ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ రాత్రి, పగలు అనే తేడా లేకుండా తరుచుగా గంటల కొద్ది విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. అధికారులను ఫోన్‌లో సంప్రదిస్తే సరైన సమాధానం ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని కోరారు. జామిడి గ్రామస్తులు కేశవ్‌రెడ్డి, సతీష్, రాంరెడ్డి, హరీష్, నవీన్, అమర్, నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు పనులకు సహకరించాలి



మాట్లాడుతున్న ఆర్డీవో వినోద్‌కుమార్

**ఇచ్చోడ:** అడేగామ(కె)గ్రామంలో నిలిచిపోయిన అంతర్రాష్ట్ర రోడ్డు పనులకు గ్రామస్తులు సహకరించాలని ఆర్డీవో వినోద్‌కుమార్, ఆర్‌అండ్‌బీ ఈఈ నర్సయ్య కోరారు. శుక్రవారం మండలంలోని అడేగామ(కె) పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఇచ్చోడ నుంచి సోనాల వరకు డబుల్ రోడ్డు పనులు పూర్తయినా.. అడేగామ గ్రామంలో అర్ధాతంరంగా నిలిచిపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు తీర్మానాలు చేశారు. మధ్యలో నుంచి ఇరువైపులా 17 ఫీట్లు, మొత్తం 34 ఫీట్ల వెడల్పుతో రోడ్డు నిర్మాణం చేయాలని, ఇళ్లు కోల్పోతున్న వారికి పరిహారం అందించిన తరువాతే పనులు ప్రారంభించాలని తీర్మానం చేసి ఆర్డీవోకు అందచేశారు. సమావేశంలో డీటీ జాదవ్ రామారావు, గ్రామస్తులు బద్దం రాంచేందర్‌రెడ్డి, చెన్నల మల్లేష్‌రెడ్డి, బద్దం రమేశ్‌రెడ్డి, నిమ్మల సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

### బంద్ విజయవంతం

**ఇచ్చోడ:** బంగ్లాదేశ్‌లో హిందువులు, హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను వెంటనే అరికట్టాలని హిందూ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన బంద్ విజయవంతమైంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్యాపార, వాణిజ్య సంస్థలు బంద్‌లో స్వచ్ఛందంగా పాల్గొన్నారు. హిందు వాహిణి, బీజేపీ, బజరంగ్‌దళ్, ఏబీవీపీ, విశ్వహిందు పరిషత్ నాయకులు వ్యాపార సంస్థలను మూసి వేయించారు. సాయంత్రం సిరిచెల్మ చౌరస్తా నుంచి అంబేద్కర్‌చౌక్, శివాజీచౌక్‌ల మీదుగా నిరసన ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ చౌరస్తాలో మానవహారం ఏర్పాటు చేశారు.

**నార్నూర్:** బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా శుక్రవారం బీజేపీ నాయకులు నిర్వహించిన బంద్ విజయవంతమైంది. ఉదయం నుంచే వ్యాపారస్తులు దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేశారు. బీజేపీ జిల్లా నాయకులు భిక్షపతి రాథోడ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు చాల్కుర్ ప్రకాష్‌లు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులతో పాటు హిందు దేవాలయాలపై జరుగుతున్న దాడులను నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తొడసం బండు, భోలా, శ్రావణ్, దేవిదాస్ పాల్గొన్నారు.

## నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలి



నిల్వ నీటిని పారబోస్తున్న సిబ్బంది



మాట్లాడుతున్న డీఆర్‌డీవో సాయన్న

**సిరికొండ:** నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీవో ఫణీందర్ పంచాయతీ అధికారులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో డ్రై డే నిర్వహించారు. పాత టైర్లు, డబ్బాలు, కుండల్లో నీటిని నిల్వ ఉంచవద్దన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీవో సంతోష్, పంచాయతీ కార్యదర్శి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఇచ్చోడ:** సీజనల్ వ్యాధుల ప్రబలకుండా ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నర్సాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి హిమబిందు అన్నారు. శుక్రవారం మాన్కపూర్‌లో డ్రైడే నిర్వహించి గ్రామస్తులతో మాట్లాడారు. దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆమె వెంట హెల్త్ అసిస్టెంట్ రాథోడ్ కృష్ణ, ఆశ కార్యకర్త గంగామణి ఉన్నారు.

**ఇంద్రవెల్లి:** గ్రామాల్లో పరిశుధ్య పనులు చేపట్టాలని డీఆర్‌డీవో సాయన్న అన్నారు. శుక్రవారం మండలంలోని దనోర(బి) గ్రామంలో నిర్వహించి డ్రైవ్ డే కార్యక్రమానికి హాజరయ్యారు. పారిశుధ్య పనులు, క్లోరినేషన్ పనులతో పాటు మొక్కలు నాటే కార్యక్రమం వివరాలను అడిగి తెలుసుకున్నారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్, ఎంపీవో సుమీర్‌హైమద్, ఏపీవో జాదవ్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ యేర్మ జాకేశ్వర్, టెక్నికల్ అసిస్టెంట్ జైస్వాల్ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

### డీఎస్పీని కలిసిన ఎస్సై

**ఆదిలాబాద్‌టౌన్:** బజార్‌హత్నూర్ ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన అప్పారావు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో కలిసి పూల మొక్కను అందజేశారు.

### ఆత్రం సుగణ జన్మదిన వేడుకలు

**బోథ్:** కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి కేక్ కట్ చేశారు.

### మంత్రిని కలిసిన మాజీ ఎంపీపీ

**బోథ్:** రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. బోథ్ మండలంలోని సొనాల ప్రధాన రహదారి కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు.

### 'ఆదివాసీగా పుట్టడం గర్వకారణంగా ఉంది'

**బోథ్:** ఆదివాసీగా పుట్టడం గర్వకారణంగా ఉందని ఏజీపీ పంద్రం శంకర్ అన్నారు. న్యాయవాది విద్యను చదివి ఏజీపీగా ఎదిగిన ఆదివాసీ నాయకుడు పంద్రం శంకర్ దంపతులను నేరేడుపల్లె గ్రామస్తులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ ఆత్రం ఆనంద్‌రావ్, ఆత్రం జైతు, ప్రధానోపాధ్యాయులు తొడసం గంగారాం, కోయిందు పటేల్, గోపాల్ పాల్గొన్నారు.

### విద్యార్థులకు నోట్‌బుక్‌ల పంపిణీ

**ఆదిలాబాద్‌టౌన్:** విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఎండీ రఫీక్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని సుభాష్‌నగర్‌లోని ఉర్దూ మీడియా పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో షేక్ అహ్మద్, ముస్తఫా, తదితరులు పాల్గొన్నారు.

## ఇలా అయితే రోగాలు రావా?

ఈఫొటోలో కనిపిస్తున్నది ఆదిలాబాద్ రూరల్ మండలంలోని తంతోలి గ్రామపంచాయతీ పరిధిలోని చింతల్‌బోరి టీడబ్ల్యూపీఎస్ పాఠశాల. ఇక్కడ అంగన్‌వాడీ కేంద్రానికి భవనం లేకపోవడంతో స్కూల్, అంగన్‌వాడీ కేంద్రం కలిపి కొనసాగిస్తున్నారు. 8 మంది స్కూల్ విద్యార్థులు ఉండగా.. 20 మంది అంగన్‌వాడీ కేంద్రానికి చిన్నారులు ఉన్నారు. పాఠశాల గోడకు అనుకొని పిచ్చి మొక్కలు పెరిగాయి. దీంతో దోమలు వృద్ధి చెంది విద్యార్థులు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంది.



ఈఫొటోలో కనిపిస్తున్నది ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి గ్రామ పంచాయతీ పరిధిలో సిరికొండ గ్రామంలోని టీడబ్ల్యూపీఎస్ పాఠశాల. ఈ పాఠశాల గేట్ ఎదుట వర్షపు నీటితో పాటు మురుగు నీరు నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెందాయి. ఈ విషయాన్ని గ్రామ పంచాయతీ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా.. ఎవరూ పట్టించుకోవడం లేదని అక్కడి సిబ్బంది పేర్కొంటున్నారు.



- పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద అపరిశుభ్రత
- వృద్ధి చెందుతున్న దోమలు
- విద్యార్థులు అనారోగ్యం బారిన పడే అవకాశం

**ఆదిలాబాద్‌రూరల్:** రాష్ట్ర ప్రభుత్వం గత కొన్ని రోజులుగా స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతోంది. కానీ మండలంలోని కొన్ని గ్రామాల్లోని పాఠశాలల, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద, ఆవరణల్లో అపరిశుభ్రత వాతావరణం కనిపిస్తోంది. ప్రధానంగా మండలంలోని కొన్ని టీడబ్ల్యూపీఎస్ పాఠశాలల సమీపంలో, ఆవరణలో వర్షపు నీటితో పాటు గ్రామంలోని మురుగు నీరు నిల్వ ఉండడం, పిచ్చి మొక్కలు పెరగడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. మండలంలోని పలు టీడబ్ల్యూపీఎస్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల సమీపంలో, ఆవరణలో అపరిశుభ్రత వాతావరణం కనిపిస్తోంది. అసలే వర్షకాలం కావడంతో దోమలు వృద్ధి చెంది విద్యార్థులు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంది. అపరిశుభ్రత వాతావరణంలో ఉంటూ విద్యను అభ్యసిస్తున్నారు. దీనికి నిదర్శమే మండలంలోని తంతోలి గ్రామ పంచాయతీ పరిధిలో గల చింతల్‌బోరి టీడబ్ల్యూపీఎస్ పాఠశాల. పాఠశాల గోడకు అనుకొని పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. అలాగే పాఠశాల ఆవరణలోని విద్యార్థులు తాగే చేతినీటి పంపు చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి దోమలకు అవాసాలుగా మారుతున్నాయి.

**అపరిశుభ్రంగా పాఠశాల ఆవరణం..**

అంకోలి గ్రామ పంచాయతీ పరిధిలోని సిరికొండ టీడబ్ల్యూపీఎస్ భవన నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో పాఠశాల ఉపాధ్యాయురాలు విద్యార్థులను నేలపై కూర్చోపెట్టి విద్య బోధన చేస్తున్నారు. పాఠశాల గేటు ఎదురుగా వర్షపు, మురుగు నీరు నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెందాయి. మధ్యాహ్నం భోజనం చేసే సమయంలో దోమలు ఆహార పదార్థాలపై వాలి విద్యార్థులు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంది. ఇప్పటికైనా గ్రామపంచాయతీ సిబ్బంది, అధికారులు స్పందించి నిల్వ ఉన్న నీటిని తొలగించి తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

### స్నేహితురాలికి చేయూత



సరుకులు అందజేస్తున్న స్నేహితులు

**ఉట్నూర్‌రూరల్:** మండలంలోని కొమ్ముగూడ గ్రామానికి చెందిన చంద్రకళ అనే మహిళ దీనస్థితిలో ఉన్న విషయం తెలుసుకున్న స్నేహితులు శుక్రవారం గ్రామానికి వెళ్లి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కనీసం ఉండేందుకు ఇల్లు లేకపోవడంతో రేకుల షెడ్డు కింద బ్రతుకుతోంది. ఆమె పరిస్థితిని చూసి చలించిపోయిన స్నేహితులు సరుకులు, ఇంటి సామగ్రి, బట్టలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నవీన్, ధరంసింగ్, తిరుపతి, పద్మ పాల్గొన్నారు.